నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 27 ఏప్రిల్ 2024 | SANGAREDDY

కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి మోసపోవద్దు

నీళ్లు, కరెంటు ఇవ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం



సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లో మాట్లాడుతున్న మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

- వంద రోజుల్లోనే కాంగ్రెస్ పాలన తేటతెల్లం
- కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతన్నలకు తప్పని తిప్పలు
- ప్రజా సేవ కోసం వస్తున్నా... ఆదరించి ఆశీర్వదించండి..
- మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 26: ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో 100 రోజుల్లోనే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. జగదేవ్‌పూర్‌లోని పీర్లపల్లి మాజీ సర్పంచ్ అంకిల్ల యాదవరెడ్డి ఏర్పాటు చేసి రుద్ర ట్రేడర్స్‌ను ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మండల నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో నీళ్లు ఉన్నా ఇవ్వలేని దుస్థితి, కరెంట్ ఉన్నాసరఫరా చేయలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. తెలంగాణ ఏర్పడక ముందు తెలంగాణ కరువుకాటకాలతో తల్లిడిందని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ గోదారి జలాలను పారించి బీడు భూములను పచ్చని మాగాణులగా మార్చారన్నారు. నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో అప్పటి పరిస్థితులు మళ్లీ వస్తున్నాయన్నారు. కేసీఆర్ లేని లోటు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నదన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు హామీల అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. ఆయనవెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నర్సింహారెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రంగారెడ్డి, కొండపోచమ్మ ఆలయ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జగదేవ్‌పూర్ ఎంపీటీసీ కవితాశ్రీనివాస్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, నాయకులు మహేశ్, కనకయ్య, చంద్రం, రవి, దర్గయ్య, బషీర్, శ్రీశైలం, బాల్‌నారాయణ, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఆదరించి, ఆశీర్వదించండి

ప్రజా సేవ కోసం వస్తున్న తనను ఆశీర్వదించాలని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కోరారు. సిద్దిపేట కలెక్టర్‌గా ఉన్నప్పుడు జిల్లా అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పని చేశామన్నారు. ఎంపీగా గెలిపిస్తే రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేస్తానని, యువతీ యువకులకు ప్రత్యేక నైపుణ్యం కలిగిన శిక్షణ అందించి ఉపాధి కల్పిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఫంక్షన్ హాల్ నిర్మించి పేదలకు ఉచితంగా శుభ కార్యాలకు అందించనున్నట్లు తెలిపారు. యువతీ యువకులు ఒక్కసారి ఆలోచించి ఎవరితో అభివృద్ధి సాధ్యమో గుర్తించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని గ్రామాల్లో తెలియజేయాలన్నారు. జగదేవ్‌పూర్ మండల ప్రజలతో తనకు ప్రత్యేక అనుభవముందని, ఇక్కడి అభివృద్ధిలో తన భాగస్వామ్యం ఎంతో ఉందని, మండలానికి ఎన్నోసార్లు వచ్చినట్లు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ శ్రేణులతో ముచ్చటిస్తూ ప్రతి కార్యకర్త సైనికుల్లా గడప గడపకూ వెళ్లి ప్రచారం చేపట్టాలా కృషి చేయాలన్నారు. తనకు సహకరించిన ప్రతిఒక్కరినీ గుర్తుంచుకొని అన్నివిధాలా అండగా ఉంటానని భరోసా కల్పించారు.

ప్రచార హోరు

ఎన్నికల ప్రచారానికి ప్రధాని మోదీ, కేసీఆర్, రాహుల్ రాక

- 30న జహీరాబాద్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ బహిరంగ సభ
- 8న సంగారెడ్డి జిల్లాలో కేసీఆర్ బస్సుయాత్ర
- దిగ్గజాల రాకతో వేడెక్కుతున్న ఎన్నికల పోరు

సంగారెడ్డి, ఏప్రిల్ 26(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల పోరు వేడెక్కుతున్నది. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారంపై దృష్టి సారించాయి. పోలింగ్ సమయం సమీపిస్తుండడంతో ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ప్రచారాన్ని వేగవంతం చేస్తున్నాయి. పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు దిగ్గజ నేతలు కదన రంగంలోకి దిగుతున్నారు. ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధాని నరేంద్రమోదీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ అడుగుపెడుతున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో ఈనెల 30న ప్రధాన నరేంద్రమోదీ పర్యటించనున్నారు. వచ్చే వారం రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారం చేయనున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇది వరకే సంగారెడ్డి జిల్లాలో ప్రచారం చేశారు. ఇటీవల అందోలు నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్‌లో బీఆర్ఎస్ లక్ష మందితో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించింది. ఈ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాల్గొని బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపారు. వచ్చేనెల మరోసారి కేసీఆర్ సంగారెడ్డిలో నిర్వహించే బస్సుయాత్రలో పాల్గొని ఎన్నికల ప్రచారం చేయనున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన అగ్రనేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటుండడంతో పార్లమెంట్ ఎన్నికల వేడెక్కుతున్నాయి. ఎన్నికల ప్రచారానికి వస్తున్న ప్రధాన పార్టీల అగ్రనేతలు ఏమి మాట్లాడతారు, ఎలాంటి హామీలు ఇస్తారు అని పార్టీల కార్యకర్తలు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పార్టీల అగ్రనేతలు ప్రచార బరిలోకి దిగడంతో వారి సభలు, ప్రచార కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు రాష్ట్ర, జిల్లా నేతలు సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

జహీరాబాద్ పార్లమెంట్‌లో మోదీ బహిరంగ సభ

బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రధాని మోదీ ప్రచారం చేయనున్నారు. జహీరాబాద్ పార్లమెంట్‌లో ఈనెల 30న నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థులు రఘునందన్‌రావు(మెదక్), బీబీ పాటిల్(జహీరాబాద్) పక్షాన ఎన్నికల ప్రచారం చేసేందుకు 30న మోదీ రానున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని అల్లాదుర్గంలో 30న మోదీ బహిరంగ సభను నిర్వహించేందుకు బీజేపీ సన్నద్ధమవుతున్నది. ఈ సభకు సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి జన సమీకరణ చేయనున్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు పటాన్‌చెరులో నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. తాజాగా మరోసారి ఎన్నికల ప్రచారానికి వస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో బీజేపీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కేంద్ర మంత్రులు, బీజేపీ ముఖ్యమంత్రులు రానున్నారు.

త్వరలో జిల్లాకు రాహుల్ రాక

ప్రధాని నరేంద్రమోదీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రచారంలో పాల్గొంటుండడంతో కాంగ్రెస్ పార్టీ సైతం ఎన్నికల ప్రచారంపై దృష్టి పెట్టింది. వచ్చేవారం సంగారెడ్డి జిల్లాలో నిర్వహించే ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రానున్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులు నీలం మధు(మెదక్), సురేశ్ షెట్కార్(జహీరాబాద్) గెలుపు కోసం త్వరలో సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. ఈ సభకు రాహుల్ గాంధీ రానున్నట్లు తెలుస్తున్నది. శుక్రవారం జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. త్వరలో సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల్లో సైతం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన జాతీయ నేతలు, రాష్ట్ర నేతలు సంగారెడ్డి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో పర్యటించి ప్రచారం చేయనున్నారు.

మే 8న సంగారెడ్డి జిల్లాలో కేసీఆర్ రోడ్‌షో

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ముందంజలో ఉంది. సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్నాయి. దీంతో మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గెలుపు లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రచార కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇటీవల సుల్తాన్‌పూర్‌లో లక్ష మందితో నిర్వహించిన సభలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎవ్వరూ ఊహించని విధంగా కేసీఆర్ బహిరంగ సభ విజయవంతమైంది. దీంతో కేసీఆర్ సభ తర హాలో ఇతర పార్టీలు బహిరంగ సభలు నిర్వహించేందుకు పూనుకుంటున్నాయి. కేసీఆర్ మరోసారి జిల్లాలో ప్రచారానికి వస్తున్నారు. మే 8న పటాన్‌చెరులో కేసీఆర్ బస్సుయాత్ర చేపట్టనున్నారు. గుమ్మడిదల, జిన్నారం, అమీన్‌పూర్, పటాన్‌చెరు మండలాల్లో బస్సుయాత్ర సాగనున్నది. పటాన్‌చెరులో కేసీఆర్ ఎన్నికల సభ ఉంటుంది. కేసీఆర్ బస్సుయాత్రను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి. మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పార్టీ తరపున విరామం లేకుండా ప్రచారం చేస్తున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు. ఎంపీ అభ్యర్థులు వెంకట్రామిరెడ్డి, గాలి అనిల్‌కుమార్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో తిరుగుతూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. జిల్లా, నియోకజవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పట్టణాలు, గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేస్తున్నారు.

ఎన్నికల ప్రచారం కాదిదీ..

హామీలు గుప్పించే సభాస్థలి

- నారాయణఖేడ్‌లో లైబ్రరీ కోసం రూ.2 కోట్లు మంజూరు చేస్తా
- మహిళా ఐటీఐ కళాశాల ఏర్పాటు బాధ్యత నాదే..
- 2వేల ఎకరాల భూసేకరణ చేయండి.. ఫార్మా కంపెనీ ఏర్పాటు చేస్తా...
- ఎన్నికల కోడ్ తర్వాత చేస్తానని హామీలిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి

మెదక్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ప్రజాప్రతినిధులు ఎలాంటి వరాలు ప్రకటించరాదు. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో జహీరాబాద్ ఎంపీ ఎన్నికల జన జాతర విజయభేరి సభకు హాజరై ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ జన జాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి నారాయణఖేడ్ నియోజకవర్గానికి హామీలు గుప్పించారు. ఇంటర్మీడియట్‌లో మొదటి, రెండో సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో తమ విద్యార్థులు ర్యాంకులు సాధించారని, వారికోసం మహిళా పాలిటెక్నిక్ కళాశాల, ఐటీఐ, పీజీ కళాశాల, ఇండస్ట్రియల్ క్లస్టర్, ప్రాంతీయ పారిశ్రామికరణ కేంద్రం ఏర్పాటు, సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు పెద్దశంకరంపేటలో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని నిండుసభలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. నారాయణఖేడ్‌కు 24/7 లైబ్రరీకి ఎస్‌డీఎఫ్ కింద రూ.2 కోట్లు మంజూరు చేస్తున్నానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మహిళా ఐటీఐ మంజూరు చేస్తున్నానని, నారాయణఖేడ్‌లో 2వేల ఎకరాలు భూసేకరణ చేసి 30 రోజుల్లో అప్పగిస్తే ఫార్మా కంపెనీ ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. తద్వారా యువతకు, మహిళలకు ఉపాధి దొరుకుతుందని, ఇవన్నీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతనే చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.



మెదక్ జిల్లా పెద్దశంకరంపేట రోడ్ షోలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సిద్దిపేటలో మాట్లాడుతున్న రాష్ట్ర హార్టికల్చర్, సెరికల్చర్ కమిషనర్ అశోక్‌రెడ్డి

నిర్దేశాలు లక్ష్యానికి చేరుకోవాలి

- రాష్ట్ర హార్టికల్చర్, సెరీ కల్చర్ కమిషనర్ అశోక్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 26 : జిల్లాలో నిర్దేశించిన ఏడువేల ఎకరాల లక్ష్యానికి అనుగుణంగా ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి కృషి చేయాలని రాష్ట్ర హార్టికల్చర్, సెరీ కల్చర్ కమిషనర్ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నంగునూరు మండలం నర్మెటలో పర్యటించి ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను పరిశీలించి, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. జూన్ వరకు ఆయిల్‌పామ్ పంటను రైతుల నుంచి స్వీకరించేందుకు ఫ్యాక్టరీ వద్ద కలెక్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి అశ్వరావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి పంపించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో ఉద్యానవన, వ్యవసాయ, ఆయిల్‌ఫెడ్, మైక్రో ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించి ఆయిల్‌పామ్ తోటలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పామాయిల్ తోటల పెంపకానికి చాలా అవకాశాలు ఉన్నాయని, పామాయిల్ విస్తీర్ణంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం తర్వాత 11,140 ఎకరాలతో మూడో స్థానంలో సిద్దిపేట జిల్లా ఉన్నదన్నారు. నర్మెటలో రూ.300 కోట్లతో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతున్నందున రైతులు పండించిన పామాయిల్ పంటకు మార్కెటింగ్‌కు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో నిర్దేశించిన 7 వేల ఎకరాల్లో నూతనంగా పామాయిల్ తోటల పెంపకానికి ఉద్యానవన, వ్యవసాయ మార్క్‌ఫెడ్, మైక్రో ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా కృషి చేయాలని, రానున్న రేండ్లేళ్లలో 25 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటల సాగు జిల్లాలో జరగాలన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ఇప్పటికే రూ.30 నుంచి రూ.40 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను, పామాయిల్ తోటలను ఉన్నతాధికారులు సందర్శించి పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉద్యానవన, హార్టికల్చర్ అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, ఆయిల్‌ఫెడ్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్దెరతో ఉచితాలు

- బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

కోహెడలో మాట్లాడుతున్న బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు

కోహెడ ఏప్రిల్ 26: ఆరు గ్యారెంటీల పేరుతో అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ఉచిత పథకాలను ఉద్దెరతో నడిపిస్తున్నదని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన జీవీ. రామకృష్ణతో కలిసి కోహెడలో విలేకరులతో మాట్లాడారు. ప్రభు త్వం ఆరు గ్యారెంటీల్లో ఉచిత బస్సు పథకం మాత్రమే అమలు చేస్తున్నారని, అదికూడా ఉద్దెరతోనే నడుస్తున్నదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాలకిచ్చిన పథకాలను అమలు చేయలేక పోతుందన్నారు. ఉచిత గ్యాస్ పథకం, ఉచిత కరెంట్ అందరికీ అందడం లేదని ఆరోపించారు. రేషన్‌కార్డు ఇవ్వకుండా రేషన్‌కార్డులు ఉన్నవారికే పథకాలు అని ప్రజలను మోసం చేస్తున్నారని చెప్పారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ పార్లమెంట్‌లో మాట్లాడి అభివృద్ధి పనులు ఏమైన తెచ్చాడా అని ప్రశ్నించారు. మతాన్ని అడ్డం పెట్టుకొని గతంలో గెలిచాడని, ఇప్పుడు అదే పంథా అవలంబిస్తే కలవదన్నారు. కరీంనగర్ నుంచి వరంగల్‌కు నాలుగు లేన్ల రహదారి తెచ్చానని, హైదరాబాద్ రైల్వేలైన్‌ను సర్వే చేయించానని బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఎంపీగా ఉంటే ఎలాంటి పనులు చేయాలో చేసి చూపిస్తానన్నారు. ప్రజలంతా మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పెరుగు నరేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ తడ్కల రాజిరెడ్డి, ఫ్యాక్స్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు, నాయకులు ఆవుల మహేందర్, పొన్నాల లక్ష్మణ్, ఇప్పరపల్లి కృష్ణమూర్తి, జాలిగాం శంకర్, గవ్వ వంశీధర్‌రెడ్డి తదితరులున్నారు.

అబద్ధాలు ప్రచారం చేస్తున్న బీజేపీ

- గ్రామాల్లో బండి సంజయ్ పర్యటించిన దాఖలాలు లేవు
- కోహెడ రోడ్‌షోలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెడ రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఏప్రిల్ 26: కాంగ్రెస్ పార్టీపై బీజేపీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నదని, ఎన్ని అబద్ధాలు చెప్పినా వినే స్థితిలో ప్రజలు లేరని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం కోహెడలో కరీంనగర్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణలతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవుడు గుడిలో ఉండాలి, భక్తి గుండెల్లో ఉండాలి. కానీ రోడ్ల మీద ఫొటోలు పెట్టి ఓట్లు అడుగుతున్న బీజేపీని ప్రజలు నమ్మరన్నారు. కాంగ్రెస్ వస్తే హనుమాన్ చాలీసా చదవనివ్వరని, హిందువుల ఆస్తులను ముస్లింలకు అప్పగిస్తారనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ గ్రామాల్లో పర్యటించిన దాఖలాలు లేవన్నారు. గ్రామాల్లోని సమస్యలు ఆయనకు పట్టవన్నారు. కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మొండిచేయి చూపుతున్న కాంగ్రెస్

- ఆరు గ్యారెంటీల అమలు లేదు..
- రుణమాఫీపై స్పష్టత లేదు...
- బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

నిజాంపేట రోడ్ షోలో మాట్లాడుతున్న బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

నిజాంపేట, ఏప్రిల్ 26: ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను సరిగ్గా అమలు చేయకుండా ప్రజలకు మొండిచేయి చూపుతున్నదని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం నిజాంపేటలో నూతన బస్టాప్ నుంచి గాంధీచౌక్ వరకు నిర్వహించిన రోడ్ షోలో రఘునందన్‌రావు పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 9న రైతులందరికీ ఏకకాలంలో రూ.2 లక్షల పంట రుణ మాఫీ చేస్తానని హామీనిచ్చిన రేవంత్‌రెడ్డి ఆ హామీని నెరవేర్చలేదన్నారు. మళ్లీ రైతులను మోసం చేసే దిశగా ఆగస్టు 15లోగా రుణ మాఫీ చేస్తానని మోసపూరిత మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. రుణ మాఫీ విషయంలో ఎటువంటి స్పష్టత లేదని, రైతులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మే స్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడిచినా రూ.4 వేల పింఛన్లు, మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధపు మాటలతో అధికారంలోకి వచ్చారన్నారు. పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను ఎంపీగా గెలిపించాలని బీజేపీ అభ్యర్థి రఘునందన్ ప్రజలను కోరారు. అనంతరం జడ్పీటీసీ క్యాంపు కార్యాలయంలో ఇతర పార్టీలకు చెందిన 30మంది కార్యకర్తలకు ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్, బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ ఉపసర్పంచ్ సంజీవ్, నాయకులు తిరుపతి, శ్రీనివాస్, మహంకాళి, శ్రీనివాస్ గౌడ్, చంద్రశేఖర్, జాల పోచయ్య, స్వామి, రాజిరెడ్డి, ఎల్లం, రమేశ్, శంకర్, రాజు ఉన్నారు.

మంత్రి ఇలాకాలో బస్సులు రద్దు

- 20 రోజులుగా హైదరాబాద్ రూట్లో నడవని సర్వీసులు
- నానా అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి
- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్

గడిపె మల్లేశ్

హుస్నాబాద్, ఏప్రిల్ 26: రవాణా శాఖ మంత్రి ఇలాకా హుస్నాబాద్‌లో బస్సు సర్వీసులు రద్దు చేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ అన్నారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ ప్రాంతంలో సరైన బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 20 రోజులుగా హుస్నాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సు సర్వీసులను డిపో అధికారులు రద్దు చేశారని, దీంతో హైదరాబాద్, సిద్దిపేటకు వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. ప్రతిరోజూ ఉదయం 5గంటలకు హుస్నాబాద్ నుంచి బయలుదేరే సూపర్ లగ్జరీ బస్సు ఉద్యోగులకు, వ్యాపారులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని, దీనిని డిపో మేనేజర్ సొంత నిర్ణయంతో రద్దు చేశాడని ఆరోపించారు. హుస్నాబాద్ రూట్లపై అవగాహన లేని డిపో మేనేజన్ ఇష్టానుసారంగా బస్సులు నడిపిస్తూ డిపోను నష్టాల్లోకి నెట్టుతున్నాడని ఆరోపించారు. కాలం చెల్లిన బస్సులను డిపోకు కేటాయించడంతో పలుమార్లు ప్రయాణికులతో వెళ్తుండగానే టైర్లు ఊడిపోయిన సంఘటనలు చోటు చేసుకున్నాయని తెలిపారు. ఇప్పటికైనా కరీంనగర్ ఆర్ఎం స్పందించి రద్దయిన బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డిపో మేనేజర్‌ను చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం స్పందించి కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులు తెప్పించాలని, అన్ని రూట్లలో బస్సులు వెళ్లేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.